పాదప్రహారం

1

మాధవుడు భట్టశ్యామిలకుని చూసీ చూడగానే తాంబూల చర్వణం ఆపివేసి సగౌరవంగా ప్రత్యుత్థానం చేసి అతన్ని తన సరసనే కూర్చోబెట్టుకున్నాడు. వ్యంగ్యంగా చిరునవ్వు చిందించి నెమ్మదిగా అడిగాడు :

"ఇదేమిటి విటశేఖరులు భట్టశ్యామిలకు లీవేళ ఇలా విచ్చేశారు!"

"ఒక పెద్ద రాచకార్యమే వచ్చిందయ్యా!"

"ఇంతటి విటశేఖరులు మీకు రాచకార్యమేమిటండీ!" అని ఎంతో ఆశ్చర్యపడ్డాడు మాధవుడు. శ్యామిలకుడు వెటకారంగా నవ్వాడు :

"మన విష్ణునాగుడే తెచ్చిపెట్టాడీ లేనిపోని రభస అంటాను!"

"ఏమి చేశాట్ట!"

"ఎప్పుడూ వేశ్యవాటిక వీధివైపేనా తొంగిచూడని ఆ మహానుభావుడు మొన్న మన మదనసేనిక భవంతికి విజయంచేశాడు."

"ఎన్నడూ పెద్దలమాట జవదాటని మహా నిష్ఠాపరుడు అతగాడికీ చిద్విలాసం ఎందుకు కలిగిందో!"

"మన భవకీర్తి లేదూ ఇలాంటివాటి కన్నీని! అతగాడే చేశాడిదంతా!"

మాధవుడు తన కేమీ బోధపడలేదన్నట్లదే తీరులో శ్యామిలకుని వైపు చూచాడు. శ్యామిలకుడు మళ్ళీ ఒక వెకిలినవ్వు నవ్వాడు!

"ఆ భవకీర్తి మనవాడితో ఏమన్నాడూ! 'నీ కేమీ భయంలేదులే. నేనున్నానుగా. ఇది రెండో కంటివాడికి తెలియనివ్వనులే!' అని మెల్లిగా బుజ్జగించి మన విష్ణునాగమ్మని చాటుమాటుగా ఆ మదనసేనిక భవంతికి తోడుకుపోయాడు."

"సరే! ఇంతకీ అంత రభస ఎందుకు జరిగింది?"

"చెబుతూంటేనే! మన విష్ణునాగుడు తను మహాభరతశాస్త్రవేత్త అనిపించుకోవాలనే భేషజంకొద్దీ రాధికాభినయం పట్టవలసిందని మదనసేనిక నడిగాడు."

"చక్కగానే అడిగాడు! బాగానే ఉంది! దానికేం!"

శ్యామిలకుడు పొంగిపొంగివస్తూన్న నవ్వాపుకుని మళ్ళీ మొదలు పెట్టాడు :

"అసలు కథంతా ఆపైనే ఉంది! ఆ మదనసేనిక మాత్రం తక్కువ తిందా? అది మన చచ్చునాగమ్మ ధోరణి అంతా ఒక్క క్షణంలో పసిగట్టివేసింది. ఆ పైన దాని కొంటెతనం నువ్వు కొంచెం చవిచూచావుగదా! అది ఏమి చేసింది—ఆ అభినయం మొదలుపెట్టి సరిగా రాధిక శ్రీకృష్ణస్వామివారిని తన పాదారవిందంతో అనుగ్రహించే రసవత్తరఘట్టంలో తన పాదాగ్రంతో విష్ణునాగుని శిరస్సుపై అలవోకగా స్పృశించింది!"

ఆ మాట విని మాధవుడొక్క నవ్వునవ్వాడు :

"వహవ్వా! ఆ విష్ణునాగుడెంతటి అదృష్టవంతుడయ్యా! అందుకనే ఆదికవి వాల్మీకి అలా సెలవిచ్చాడు! 'ఏతి జీవంత మానందో నరం వర్ష శతాదపి!'—బతికిఉంటే నూరేళ్ళకైనా మనిషి అన్నవాడి కేదో మహా భాగ్యం పట్టి తీరుతుంది. నిజమే!"

ఆ పైన శ్యామిలకుడు చెప్పేది తిన్నగా వినిపించుకోకుండా అదే పనిగా నవ్వడం మొదలుపెట్టాడు. శ్యామిలకుడు తాను చెప్పేదింకా పూర్తికాలేదని అతని కడ్డుతగిలాడు. సరేనని మాధవు డతడు చెప్పేదంతా శ్రద్ధగా ఆలకించాడు. శ్యామిలకుడు మొదలుపెట్టాడు :

"జరిగిన రభసంతా ఆ పైనే జరిగింది. మదనసేనిక పాదాగ్రంతో అలవోకగా తాకగానే విష్ణునాగుడు తొకతొక్కిన తాచులా మండిపడ్డాడు. ఆమె ఆ విధంగా తన తల తన్నడంతో తన ఆశ్రేయ పౌరుషేయాలన్నీ అమాంతంగా మంటగలిసి పోయాయని వలవలా వాపోయాడు. తన నిష్ఠలు, నియమాలు—అన్నీ గంగలో కలిసిపోయాయనీ, తన కిక ప్రాయశ్చిత్తం తప్ప గత్యంతరంలేదనీ తలపట్టుకుని తేలు కుట్టినట్టు అదేపనిగా విలవిల లాడడం మొదలుపెట్టాడు.

"పాపం! మదనసేనిక ఆ ఆఘాతంతో నిలువునా నీరయిపోయింది. తనవల్ల పెద్ద తప్పిదమే జరిగిపోయిందనీ, ఇక ఎప్పుడూ ఇలాంటి మహాపచారం చెయ్యననీ అనేక విధాలుగా అతన్ని కాళ్ళా వేళ్ళా పడి బతిమాలుకుంది. కాని విష్ణునాగు డిక ఆమెమాట చెవి కెక్కనీయలేదు! ఇక అక్కడ ఒక్క నిమిషమైనా నిలబడనని తటాలున లేచి నిలబడ్డాడు.

"భవకీర్తి అంతవరకూ నోటమాటలేక అలాగే అక్కడ కూలబడిపోయాడు. విష్ణునాగుడు తటాలున లేచి నిలబడేసరికి అతని కేమి తోచిందో—అతడుకూడా విష్ణునాగునికి బాగా పక్కతాళం వేశాడు. ఆ పైక్షణంలో వారిద్దరూ మదనసేనిక భవంతి దాటి రాజవీథిలో పడ్డారు."

శ్యామిలకు డదేపనిగా వెకిలిగా నవ్వాడు. ఈమారు మాధవు డతని కడ్డుపడాడు :

"అయితే మధ్యన ఈ రభస అంతా ఎందుకు ?"

"విష్ణునాగుడు స్వయంగా విట పరిషత్తువారిని తనకు ప్రాయశ్చిత్తం విధించవలసిందని అభ్యర్థించాడయ్యా! అందుచేతనే ఈ వేళ గోధూళి వేళ విట మండలివారంతా విట మండపంలో సమావిష్టు లవు

తున్నారు! నీవు తప్పక విట మంటపానికి విజయంచేసి విష్ణునాగునికి ప్రాయశ్చిత్తం సెలవిప్పించాలి! నీవు కేవలం విటధర్మ వేత్తవుగదా!''

శ్యామిలకుడు ధూర్తవినయం నటిస్తూ మాధవుని ఎదట నుదుటిపై అంజలి ఘటించి కొంచెం తలవంచి సగౌరవంగా నిలుచున్నాడు.

మాధవుని కదంతా ఒక పెద్ద అభూతకల్పనగా, కపట నాటకంగా కనిపించింది. కాని శ్యామిలకుడు చెప్పేదంతా వట్టి కల్ల అని కొట్టివెయ్యడానికి కూడా అతనికి మనసొప్పలేదు. కొంచెం సందేహిస్తూ అడిగాడు:

''అయితే ఆ విష్ణునాగుడు ప్రాయశ్చిత్తం సంగతి ధర్మశాస్త్రజ్ఞుల్ని అడగకుండా విట పరిషత్తువారి వెంగు కడుగుతున్నాడు ?''

''నాకు అప్పుడే వేళ మించిపోతూంది! ఇవ్వన్నీ నీ కెరిగించడానికిప్పుడు తీరికలేదు. అన్నీ అక్కడే తెలుస్తాయి. తప్పక విట మంటపానికి విజయం చెయ్యాలి!''

అని శ్యామిలకుడు త్వరగా అడుగులు వేసుకుంటూ, రాజవీధిలో పడ్డాడు. మాధవుడు కొంతసేపటివరకూ అలాగే దిగాలుపడి నిలుచున్నాడు. ఆ విడ్డూరమేదో తెలుసుకోవాలని వెంటనే విటమంటపానికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

2

సార్వభౌమ నగరం నవచైత్ర శోభతో కలకలలాడింది. సాయంకాలవేళ నీరెండలో నగరోద్యానాలలో రాలిపడిన పుప్పొడి తళతళలాడింది.

సంపన్నులయిన పౌరులనేకులు గజాశ్వాందోళికాది వాహనాల మీద, కర్ణీరథాలమీద వాహ్యాళికి బయలుదేరారు. వారందరి ముఖాలలోనూ నూతన వసంతోత్సాహం వెల్లివిరిసింది.

కొందరు యువకులు వారాంగనలతో కలిసి, ఉత్తమాశ్వాలపై హుషారుగా స్వారిచేస్తున్నారు. మరికొందరు వారాంగనలుత్తమాశ్వాలపై ఒంటరిగానే స్వారిచేస్తూ తమ ఒయ్యారాలన్నీ పార్శ్వ

లలో సాగిపోయే యువజనులపై ఒలకబోస్తున్నారు. కొందరుత్తమాంగన లాందోళికలలో సాగిపోతూంటే పైరగాలికి తొలిగిన వారి మేను ముసుగులు పౌరుల కప్పుడప్పుడు సాయంకాలానికి పూర్వమే చంద్రోదయ విభ్రాంతి కలిగిస్తున్నాయి.

కాని ఆనాడు రాజవీధిలో నిరుత్సాహంగా సాగిపోయే విష్ణునాగుని కొక్కనికే ఆ ఉత్సాహం. అంతా ఏదో దారీ తెన్నూ లేని అనాచారంగా కనిపించింది. అతడలాగే తొందర తొందరగా విట మంటపం వైపు సాగిపోయాడు.

విష్ణునాగుడు సార్వభౌమనగర మహామాత్రుని పుత్రుడు. అతని తండ్రి స్వర్గస్థుడైనా ఆయనమీది గౌరవంవల్లనయితేనేమి, విష్ణునాగుని సేవాతత్పరతవల్లనయితే నేమి సార్వభౌమ నగరాధీశ్వరుని కొలువులో అతని కొక చిన్నపదవి దొరికింది.

విష్ణునాగుని కిప్పటికీ ఇంకా ఇరవైఐదు ఏళ్లయినా నిండలేదు. అయితే అతని కింతకు పూర్వమే వివాహం జరిగిపోయింది. వెంటనే భార్య కాపరానికి వచ్చివేసింది.

మొదటినుంచి అతడు బాగా తండ్రిచాటు బిడ్డగానే పెరిగాడు. తండ్రి కాలంచేసి అప్పుడే రెండుమూడేళ్ళయింది. కాని అతనిలోని తండ్రిచాటుతనం ఇంకా అలాగే ఉండిపోయింది.

విష్ణునాగునికి తండ్రి సంపాదించిపోయిన ఐశ్వర్యం కొంత సంక్రమించింది. ఆ పైన అతడు చాలా భయసుడు. పైగా కొంచెం అమాయికుడు. కనుకనే ఎంతో గుట్టుగా సంసారయాత్ర సాగిస్తూ ఇరుగు పొరుగుల నోళ్లల్లో పడకుండా మర్యాదగా కాలక్షేపం చేసుకుంటున్నాడు.

విష్ణునాగుడెంతో నిష్ఠాపరుడు. దైవబ్రాహ్మణభక్తి అతనికి అనూచానంగా సంక్రమించింది. తెల్లవారు జామునే లేవడం, నియమాలూ, నిష్ఠలూ, జపతపాలూ మొదలైనవన్నీ ముగించుకోవడం, భోజనానంతరం కొలువుకూటానికి వెళ్ళిపోవడం, మళ్ళీ దీపదీపాలవేళ తిరిగి రావడం—ఇదీ అతని నిత్యదినకృత్యం! అంతేగాని అతడెన్నడూ పురోద్యానాల వైపు వాహ్యాళికైనా వెళ్ళిన పాపాన పోలేదు.

తండ్రి గతించిన కొన్నాళ్ళ కతనిధోరణి కొంచెం మారింది. దానికి చాలావరకు భవకీర్తే కారణం. అతగాడు విష్ణునాగునికి కొంచెం దూరబంధువు.

విష్ణునాగునికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నించి భవకీర్తి కాలని మీాది ఆప్యాయత బాగా పెరిగింది. భవకీర్తి తాత ముత్తాతలు సంపాదించినదంతా నృత్యగీతాది ప్రసంగాల క్రింద ఆర్పేశాడు. ఇక ఆలని కారోజు గడపాలంటే ఎవరినో ఇంకొకరి నాశ్రయించక తప్పదు. ఆ సమయంలో అతనికి విష్ణునాగుని సంగతి జ్ఞాపకం వచ్చింది. అప్పటి నించీ నెమ్మది నెమ్మదిగా అతనితో బాగా నేస్తం కలిపాడు.

భవకీర్తితో స్నేహం ముదిరినకొద్దీ విష్ణునాగునికి తన నియమాల మీాది పట్టు కొంచెం సడలింది.

ఒకనాడు భవకీర్తి విష్ణునాగునితో మదనసేనిక భవంతిలో నృత్యం చూసివత్తామని అన్నాడు. విష్ణునాగుడు మొట్టమొదట దానికంగీకరించలేదు. కాని ఊరూ, వాడా వసంతోత్సవాలతో తలమునకలవుతూంటే అతనికి కూడా కొంచెం ఉత్సాహం బయలుదేరింది. ఒకనాడు భవకీర్తితో కలిసి మదనసేనిక భవంతికి వెళ్ళాడు.

కాని అక్కడ ఆ విదూరం జరగగానే విష్ణునాగుడు వెంటనే ధర్మశాస్త్రవేత్తల సన్నిధికి బయలుదేరాడు. భవకీర్తి అదే చక్కని మార్గమని చెప్పి చల్లచల్లగా తన ఇంటికి జారుకున్నాడు. ఇక ఆనాటి నించీ విష్ణునాగుడంటేనే అతనికి భయం పట్టుకుంది. అలాంటి పరమ ఛాందసుణ్ణి మదనసేనిక నృత్యగోష్ఠికి పిలుచుకుపోవడం ఒక పెద్ద తెలివి తక్కువని అనుకొని రెండుచేతులతోనూ రెండు చెంపలు వాయించుకొన్నాడు.

విష్ణునాగుడు ధర్మవేత్తల సన్నిధికి వెళ్ళి తనకు మదనసేనికవల్ల జరిగిన మహాపచారం అంతా ఆమూలాగ్రంగా విన్నవించుకొన్నాడు.

తన తాతముత్తాతలు పరమభాగవతోత్తములనీ, దుస్సాంగత్యం వల్ల తన కిటువంటి దురదృష్టం సంభవించిందనీ, దానికి ప్రాయశ్చిత్తమేదైనా సెలవీయవలసిందనీ పరిపరివిధాలుగా వారి పాదాలపైబడి ప్రాధేయపడ్డాడు.

ధర్మవేత్త లతని ధోరణి చూచి కొంచెం ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లో ద్విజన్ములు కూడా అంతగా. పాటించని ఆచారాలంటే అతని కంతటి ఆసక్తి కలగడం వారి కెంతో విచిత్రంగా కనిపించింది.

అక్కడ నలుగు రైదుగురు ధర్మవేత్త లేవో ధర్మసూక్ష్మాలు చర్చిస్తున్నారు. వారంతా తమ ధర్మశాస్త్రగ్రంథాలన్నీ గాలించి చూచారు. కాని వారి కెక్కడా ఆ గ్రంథాలలో గణికా పాదప్రహారానికి తగిన ప్రాయశ్చిత్తం కనిపించలేదు. వా రామాటే విష్ణు నాగునితో అన్నారు. అయినా అతడు తన పట్టు విడవలేదు. వారంతా ఒకరి మొహ మొకరు చూచుకున్నారు. ముసిముసినవ్వులు నవ్వుకొన్నారు. విష్ణునాగుడు వట్టి వెర్రిబాగులవాడనీ, పైగా కొంత మూర్ఖత్వంకూడా దానికి తోడైందనీ బాగా పసికట్టి వేశారు. వెనువెంటనే వారిలో ఒక ధర్మవేత్త అతని కొక చిన్న సదుపదేశం చేశాడు. అది కేవలం విటపరిషత్తు నిర్ణయించవలసిన ప్రశ్న అనీ, విటమండలి దగ్గరికి వెళ్ళవలసిందనీ ప్రోత్సహించాడు. విట సభాపతి భట్టిజీమూతుడతని ప్రార్థన విని ఆనాటి సాయంకాలమే విట శేఖరులందరూ విటమంటపానికి విచ్చేయ వలసిందని ఆహ్వానించాడు.

విష్ణునాగుడు విటమంటపం చేరుకునేసరికి సాయంకాల సూర్యకిరణాలు మంటపం వాకిట నిలిచిన కర్ణీరథాలమీదా, గజాశ్వాందోళికాది వాహనాలమీది వెండిబంగారు మువ్వలమీదా చిత్రిచిత్రిమైన రంగు రంగుల వసంతోత్సవ చూర్ణాలు వెదజల్లుతున్నాయి. అంతలో అతని కొక సౌధశిఖరంమీద పెంపుడు నెమలికి నృత్యం నేర్పుతున్న ఒక వారాంగన కనిపించింది.

అతడు తటాలున తన దృష్టి మరిఒకచోటికి మరల్చివేశాడు. ఆ ప్రదేశంలో అతనికి వసంతోత్సవంలో ఒకరొకరిపై వసంతాలు చల్లుకొంటున్న యువతీ యువకుల కోలాహలం వినిపించింది. ఇంకొకచోట ఒక నెమలికేక వినిపించింది. అంతలోనే దూరదూరంగా నగరోద్యాన వనంలో సన్న సన్నని కోయిల పిలుపు వినిపించింది. విష్ణు నాగుడు తటాలున తలవంచుకొని తొందరగా విటమంటపంలో ప్రవేశించాడు.

3

విటమంటపం ఆ నాడు అతనికి సాక్షాత్తుగా వసంతోత్సవం రూపుదాల్చినట్టే కనబడింది. విష్ణునాగు డొక మూల సుఖాసనంమీద తన మేను జేరవేశాడు. విటశేఖరులు కొందరతనినిచూచి ఎంతో మర్యాదగా పక్క పక్కలకు తొలిగిపోయారు. మఱికొందరతనిని ఎగాదిగా చూచి చిరునవ్వులు నవ్వుకొన్నారు. ఇంకా కొందరతని ఘోషే పట్టించుకోవడం మానివేసి మధుసేవలో నిమగ్నులై అటుఇటు తూలుతూ కూర్చున్నారు. మరికొందరు గుంపులు గుంపులుగా చేరి పాచికలు విసిరి నేను గెలిచానంటే నేను గెలిచానని ఎగిరెగిరి గంతులు వేస్తున్నారు.

విష్ణునాగు డక్కడ జేరిన వారందరికేసీ కొంచెం పరిశీలనగా చూశాడు. వారిలో చాలామంది అతనికి కేవలం అపరిచితులు. కొందరి ముఖా లతనికి కొంచెం చూచాయగా గుర్తుకొచ్చాయి. వారిలో కొందరు కేవలం విటులు. మరికొందరు నటులు. మరికొందరు గానవిద్యాప్రవీణులు. మరికొందరు కవులు. ఆ కవులలో కొందరు కాశీకోసలాది ప్రాంతాలలో ఒక మద్య పాత్రకోసం తమ చాటుకావ్యాలమ్మివేసి ఆ మద్యపాత్రలతోనే తృప్తిపడిన మహానుభావులు!

విష్ణునాగుని కా నట విట గాయక కవిశేఖరుల తీరులు చూడగానే ఒళ్ళంతా ఒక్కమారుగా జలదరించింది. అతనికేదో ఒక వినూతన ప్రపంచంలో ప్రవేశించినట్లనిపించింది. ‘‘వీరందరూ ఇలా భ్రష్టులయిపోతున్నారేమి?’’ అని అతడు కొంచెం ఆశ్చర్యపోయాడు. ‘‘నేనిక్కడ కెందుకు వచ్చాను’’ అని కొంచెం కించపడ్డాడు. కాని ఆపైన ఇక చేసేదేమీ లేక అలాగే ఆ సుఖాసనంలో కూలబడి పోయాడు.

అటుపిమ్మట విటమండలి సభాపతి భట్టిజీమూతుడు విటశేఖరులందరికీ ప్రస్తుత విషయం విన్నవించాడు :

‘‘తామందరూ వైదిక సంప్రదాయ వేత్తలు. విటాచారధర్మజ్ఞులు. మన విష్ణునాగుడు పరమనైష్ఠికుడు. మహాబ్రహ్మణ్యుడు! ఇతని శిరస్సు వేదమంత్రోక్తధారలచే పరిపూతమైనది. అటువంటి పరమనైష్ఠికుడు

విష్ణునాగుని శిరస్సు మదనసేనిక పాదస్పర్శచేత అపవిత్రమై పంకిలమై పోయింది.

"మీలో విటధర్మవేత్తలు తనకి సముచితమైన ప్రాయశ్చిత్తం ఉపదేశింపవలెనని ఇత డందరికీ అంజలి ఘటించి సవినయంగా ప్రార్థిస్తున్నాడు."

భట్టిజీమూతుడు సదస్యులందరివైపూ కొంచెం వ్యంగ్యంగా చూచి కన్నుగీటాడు. మళ్ళీ ఇంకొకమారు సదస్యులందరికీ సవినయంగా నివేదించాడు:

"విటధర్మం తెలిసిఉండినా, విష్ణునాగునికి ప్రాయశ్చిత్తం ఉప దేశించనివారు, తల్లిదండ్రుల ఆజ్ఞప్రకారం ద్యూతమద్యపాన వారవేశ్యా ప్రసంగాలలా గెవిడిచి పెట్టనివారి మహా రౌరవాది నరకాల పాలై పోతారు!"

అని నెమ్మదిగా తన ధర్మాసనంమీద కూర్చున్నాడు. సదస్యు లలో చాలామంది ఆ శపథంలోని పరిహాసవ్యంగ్యం గ్రహించి ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు.

వారి నవ్వులు చూడగానే విష్ణునాగుని హృదయంలో ఏదో కొంచెం అనుమానం బయలుదేరింది. అయినా అత డలాగే వారి ప్రసంగాలన్నీ అతి శ్రద్ధగా ఆలకిస్తూ కూర్చున్నాడు:

వెంటనే విటమహోపాధ్యాయు డనంతకథకుడు హఠాత్తుగా లేచి నిలుచున్నాడు.

"కామినీమణి అయినటువంటి మదనసేనిక పాదప్రహార దోహ దంతో అశోకవృక్షం కూడా చిగిరించి పూవులు పూస్తుంది. అటువంటి పాదాగ్రంతో ఆమె ఇతని అపవిత్ర శిరస్సు స్పృశించింది. కనక ముందుగా ప్రాయశ్చిత్తం జరగవలసిన దామె పాదానికే గాని ఇతనికి కానేకాదు!"

ఆ మాట వినగానే సదస్యులంతా మరింతగా పగలబడి నవ్వారు.

ఆ పరిహాసంతో విష్ణునాగునికి వారందరిమీదా కలిగిన అనుమానం మరింత దృఢపడింది. అయినా అనవసరంగా నలుగురిలోనూ ఇంకా

నవ్వులపాలై పోకూడదని నిశ్చయించుకొని అలగే కుంభనగా కూర్చున్నాడు.

అంతలో సభాపతి భట్టిజీమూతుడు లేచి సదస్యులు విటధర్మం తు. చ. తప్పకుండా నిర్ణయించి విష్ణునాగునికి ప్రాయశ్చిత్తం ఉపదేశించాలని హెచ్చరించాడు.

ఆ మాట వింటూనే గుప్తరోమశ కవి లేచి నిలుచున్నాడు:

"ఆ వారాంగన మదనసేనిక పాదోదకంతో ఇతని శిరస్సుమీద అభిషేకించండి! ఇలాంటి పరమఛాందసునికిదే తగిన ప్రాయశ్చిత్తం!"

వెనువెంటనే విటసదస్సులో అంతటా సాధువాదాలు, హర్షధ్వానాలు చెలరేగాయి.

తరువాత రుద్రవర్మ లేచి నిలుచున్నాడు:

"సభ్యు లీతనిని ఈ విధంగా పరిహసించడం న్యాయ్యంకాదు! ఆ పాపాత్మురాలు మదనసేనిక పాదాంగుళులు సోకిన ఇతని శిరోజాలన్నీ ఖండించివెయ్యాలి! అదే ధర్మశాస్త్ర సమ్మతమైన ప్రాయశ్చిత్తం! నా మాట వినండి!"

అటుపిమ్మట అప్పుడప్పుడే పానపాత్ర అంతా ఒకేఒక గుక్కలో ముగించివేసిన భవకీర్తి హఠాత్తుగా అక్కడవాలాడు:

"నేనొక ప్రాయశ్చిత్తం చెబుతాను, శ్రద్ధగా వినండి! ఇతని శిరస్సు సోకగానే ఆ సుకుమారి మదనసేనిక పాదం బాగా నొచ్చి ఉంటుంది. అందుచేత ఆమె పాదాలొత్తడమే ఇతనికి సరియైన ప్రాయశ్చిత్తం!"

తరవాత సభాపతి భట్టిజీమూతుడు నెమ్మదిగా లేచి సభాపతి మర్యాదకు భంగంరాని విధంగా ఇంకొక విధంగా ప్రాయశ్చిత్తం ఉపదేశించాడు:

"నేను విష్ణునాగునికి ధర్మసమ్మతమైన ప్రాయశ్చిత్తం విధిస్తున్నాను. శ్రద్ధగా వినండి! నేనిప్పుడే మదనసేనిక భవంతికి వెళ్లిపోతున్నాను. ఆమె పాదప్రహారంతో నా శిరస్సు పులకించగానే ఇతడది చూచి ఆనందంతో తలపంకించాలి! ఇదే ఇతని శిరస్సుకు సరియైన ప్రాయశ్చిత్తం!"

సభాపతి తుది ధర్మనిర్ణయం వినగానే సభ్యులందరూ ముక్తకంఠాలతో అదే సరియైన ప్రాయశ్చిత్తమని హర్ష ధ్వానాలు చేశారు.

అప్పటికి విష్ణునాగునికి తన తెలివితక్కువతనమంతా తెలిసి వచ్చింది. వారంతా చేసినవి కేవలం పరిహాసప్రసంగా లన్న విషయం అతని కప్పటికి బాగా బోధపడిపోయింది. ధర్మవేత్తలు విటమండలి సన్నిధికి వెళ్ళవలసిందని తన కాజ్ఞాపించడానికి కూడా అదే కారణమని అతడప్పుడు గ్రహించివేసి గుంభనగా ఒక చిరునవ్వు నవ్వి సవినయంగా సదస్యులందరికీ వంగి వంగి వంకదణ్ణాలు పెట్టాడు:

"ఆర్యమిత్రుల ప్రాయశ్చిత్తాలన్నీ ధర్మసమ్మతమైనవేనని నాకిప్పుడిప్పుడే అవగాహన అయింది! అందుచేత భట్టిజీమూతుల అనంతరమే నేను ముమ్మారులు మదనసేనిక పాదప్రహారభాగ్యం పొంది, పాపపంకిలములై పోయిన నా మనశ్శరీరాలకు యథావిధిగా ప్రాయశ్చిత్తం జరిపించుకోవాలని నిశ్చయించుకున్నాను. ధర్మవేత్తల కిదే నాకృతజ్ఞతాంజలి!"

అని అలాగే దోసిలిఒగ్గి ఆ సభామధ్యంలో అలాగే దీపస్తంభంలా నిలుచున్నాడు.

అతని సమయస్ఫూర్తికీ, మెలకువకూ హర్షించిన సదస్యులంతా ఆకాశం చిల్లులు పడేటట్టు హర్ష ధ్వానాలు, సాధువాదాలు చేశారు. అనంతరం సువర్ణ మద్యపాత్రిల కోలాహలంలో విష్ణునాగుడు, విటమండలి వసంతోత్సవానందతన్మయతలో మత్తిల్లి మైమరిచారు!